సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



కొల్లేరు అభివృద్ధి ప్రదాత

కొల్లేరు అభివృద్ధి ప్రదాతగా, ఇక్కడ ప్రజలకు వెలుగు చుక్కగా నిలిచారు సైదు గంగరాజు. కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 8లో ▸



శరవేగంగా సబ్‌స్టేషన్లు

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారం, కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సబ్‌స్టేషన్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. 8లో ▸



ఐటీఐ కౌన్సెలింగ్

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ నిమిత్తం మూడో విడత కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నిర్వహించనున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

యుద్ధప్రాతిపదికన మౌలిక వసతుల కల్పన



దువ్వలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్

సాక్షి, భీమవరం: గృహ నిర్మాణాలు పూర్తయిన జగనన్న కాలనీల్లో యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ జీవీ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం స్థానిక విష్ణు కళాశాలలో గృహనిర్మాణశాఖ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, వీటిని నెలాఖరు నాటికి సీఎం జగన్ చేతులమీదుగా ప్రారంభోత్సవాలు చేయనున్నారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నిర్మించిన 24,675 ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధానంగా విద్యుద్దీకరణ, అంతర్గత రోడ్లు, తాగునీటి వసతి, సోప్ పిట్స్ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. అలాగే పలు దశల్లో ఉన్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయించాలన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వెంకటరమణ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన

తణుకు టౌన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ జీవీ ప్రసాద్ ఆదేశించారు. తణుకు రూరల్ మండలం దువ్వ, పైడిపర్రులో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. కాలనీలకు స్వాగత ద్వారాల నిర్మాణాలను కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. దువ్వలో ఆప్షన్-3లో నిర్మించిన గృహాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

గూడెంలో కుండపోత



కడియద్దలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో సోమవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. ఉదయం 8.19 గంటల నుంచి గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన, అంతర్గత రహదారుల్లో వర్షం నీరు నిలిచింది. పట్టణంలోని టీటీడీ కల్యాణమండపం రోడ్డు, మసీదు సెంటర్, సాలిపేట, కోతిబొమ్మ సెంటర్, కడకట్ల, వీకర్స్ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. డ్రైయిన్లు పొంగి ప్రవహించాయి. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉండగా ఉదయం 11 గంటల నుంచి భానుడు ప్రతాపాన్ని చూపించాడు.

భీమడోలులో ఏకధాటిగా..

భీమడోలు: భీమడోలు మండలంలో సోమవారం ఉదయం ఏకధాటిగా రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం గ్రామాల్లో రోడ్లపై వర్షం నీరు పొంగి ప్రవహించింది. దీంతో జాతీయ, రాష్ట్ర రహదారుల్లో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే వర్షాల వల్ల పంట చేలకు మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సందేహాల నివృత్తి

భీమవరం(ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా సవరణపై సందేహాలుంటే అధికారులతో నివృత్తి చేసుకోవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమై ఓటర్ల జాబితా సవరణ, రేషనలైజేషన్ ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘ నిబంధనల మేరకు ఓటర్ల జాబితా సవరణ ఉంటుందని, ఎటువంటి అనుమానాలకు తావులేదన్నారు. పోలింగ్ స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంటేనే దానిని మార్పు చేస్తున్నామని, ఎవరూ లేరని తెలిస్తేనే పరిశీలన అనంతరం ఓట్ల తొలగింపు ఉంటుందన్నారు. పక్కాగా చేర్పులు, మార్పులు, తొలగింపులు చేస్తున్నామన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియలో ఒక కుటుంబ సభ్యుడిని గాని, ఒక వీధిలోని ఓటర్లను గాని వేర్వేరు పోలింగ్ స్టేషన్లకి మార్చమన్నారు. రాజకీయ పార్టీలు ప్రతినిధులు అన్నివిధాలా సహకరించాలని కలెక్టర్ కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు (వైఎస్సార్‌సీపీ), బీహెచ్ శ్రీనివాస్‌వర్మ (బీజేపీ), టి.వంశీరెడ్డి (ఐఎన్‌సీ), కాటూరి కరుణాకర్ (బీఎస్పీ), జేఎన్‌వీ గోపాలన్ (సీపీఎం), ఉప్పులూరి చంద్రశేఖర్ (టీడీపీ), కలెక్టరేట్ ఏఓ అప్పారావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ ఎల్.నరసింహారావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు
తీపి కబురు

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువ చేయడంతో పాటు స్థానికంగా యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించారు. గతేడాది సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ (ప్రొబేషన్ డిక్లేర్) చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అప్పటినుంచి పే స్కేల్ ప్రకారం జీతాలు అందిస్తోంది. శాశ్వత ఉద్యోగులుగా మారి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం తొలి ఇంక్రిమెంట్, డీఏ పెంపుతో జీతాలు పెంచింది. పెరిగిన జీతాలు అందుకున్న ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



భీమవరం 3వ వార్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఏడాది కానుక

- శాశ్వత ఉద్యోగులకు పెరిగిన పే స్కేల్
- తొలి ఇంక్రిమెంట్, డీఏ అందుకున్న ఉద్యోగులు
- జిల్లా కేంద్రం సమీపంలో వారికి 16 శాతం హెచ్ఆర్ఏ వర్తింపు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 9,410 మందికి ప్రయోజనం

భీమవరం(ప్రకాశం చౌక్): ఉమ్మడి జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. శాశ్వత ఉద్యోగులుగా మారి ఏడాది పూర్తయిన వారికి ఏ మాత్రం జాప్యం లేకుండా ఇంక్రిమెంట్, డీఏ కలిపి జూలై నెల జీతాన్ని ఆగస్టులో అందించింది. తొలి ఇంక్రిమెంట్, డీఏ పెంపుతో జీతం పెరుగుదల కనిపించడంతో సచివాలయ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో ఉద్యోగం చేపట్టిన తర్వాత ప్రొబేషన్ సకాలం పూర్తిచేయడం, తమని శాశ్వత ఉద్యోగులుగా చేయడంతో పాటు ఏడాది పూర్తయిన వెంటనే ఇంక్రిమెంట్, డీఏ పెంచడం సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఉద్యోగులు అంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 1,140 సచివాలయాల్లో 9,410 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ఇంక్రిమెంట్ రూ.660

వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఇంక్రిమెంట్ రూ.660 చెల్లించింది. డీఏను వార్డు సచివాలయ అడ్మిన్, గ్రామ సచివాలయ కార్యదర్శికి రూ.781 చొప్పున పెంచింది. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు రూ.764 చొప్పున డీఏ పెంచారు.

మొత్తంగా రూ.1,500కు పైగా..

ప్రభుత్వం ఇంక్రిమెంట్‌తో పాటు డీఏ పెంచడంతో సచివాలయ ఉద్యోగులకు కేడర్‌ను బట్టి రూ.1,503 నుంచి రూ.1,546 వరకు జీతాలు పెరిగాయి. ఈ లెక్కన వార్డు అడ్మిన్లకు రూ.1,546, వార్డు సెక్రటరీలకు రూ.1,530, గ్రామ సచివాలయ సెక్రటరీలకి రూ.1,521, గ్రామ సచివాలయ ఉద్యోగులకు రూ.1,503 చొప్పున జీతాలు పెరిగాయి.

16 శాతం హెచ్ఆర్ఏ : జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్లలోపు ఉన్న సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం 16 శాతం మేర హెచ్ఆర్ఏ అందిస్తోంది. దీంతో జిల్లా కేంద్రానికి సమీపంలోని వారికి రూ.950 అదనపు ప్రయోజనం చేకూరుతోంది. మిగిలిన ఉద్యోగులకు 12 శాతం హెచ్ఆర్ఏ వర్తిస్తోంది. మొదట్లో సచివాలయ ఉద్యోగులందరికీ ఒకే రకమైన హెచ్ఆర్ఏ వర్తించగా.. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నవారికి అదనపు మేలు చేకూరింది.

జీతాల పెరుగుదల ఇలా..

ఉద్యోగి	పాత స్కేల్ (రూ.లలో)	కొత్త స్కూల్ (రూ.లలో)
వార్డు అడ్మిన్	31,648	33,194
గ్రామ సచివాలయ సెక్రటరీ	30,723	32,244
వార్డు సచివాలయ ఉద్యోగి	30,749	32,279
గ్రామ సచివాలయ ఉద్యోగి	29,851	31,354

ఉమ్మడి జిల్లాలో సచివాలయాలు **1,140**

ఉద్యోగుల సంఖ్య **9,410**

చాలా సంతోషం



ప్రొబేషన్ డిక్లర్ చేసి పేస్కేల్ ద్వారా జీతాలు చెల్లించడం, ఏడాది పూర్తికాగానే ఇంక్రిమెంట్, డీఏతో కలిపి జీతాలు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. అలాగే జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల సమీపంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు సైతం హెచ్ఆర్ఏ 16 శాతం ఇవ్వడం సంతోషంగా ఉంది. థ్యాంక్యూ సీఎం సార్.

– ఎ.శ్రీనివాస్, 3వ వార్డు అడ్మిన్, భీమవరం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సచివాలయ శాశ్వత ఉద్యోగిగా ఏడాది కాలం పూర్తిచేసుకుని మొదటి ఇంక్రిమెంట్, డీఏతో కలిపి జీతం తీసుకోవడం సంతోషంగా ఉంది. సకాలంలోనే మాకు ప్రొబేషన్ పూర్తి చేసి పే స్కేల్ ద్వారా జీతాలు చెల్లించడం వెంటనే ఇంక్రిమెంట్, డీఏతో జీతాలు చెల్లించి భరోసా కల్పించిన సీఎం సార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– ఆర్.నరేష్, గ్రామ సచివాలయ సెక్రటరీ, కొండేపూడి

ఓటర్ల జాబితాపై అలసత్వం సహించం

కలెక్టర్ ప్రశాంతి



తాడేపల్లిగూడెంలో సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం అర్బన్/పెంటపాడు/తాడేపల్లిగూడెం/అత్తిలి: ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలని, నివేదికలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, అలసత్వం వహిస్తే సహించమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం ఆమె తాడేపల్లిగూడెంలోని 32వ వార్డు, పెంటపాడు మండలం ముదునూరు, అత్తిలి మండలం ఈదూరు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఓటర్లకు సంబంధించిన రిజిస్టర్లు, కంప్యూటర్లలో డేటాను పరిశీలించారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు తొలగించారని ప్రజల నుంచి ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదన్నారు. ఓటర్ల చేర్పులు, మార్పులపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఓటర్ల జాబితా సవరణ చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి దుర్గేష్, గూడెం కమిషనర్ అనపర్తి సామ్యూల్, తహసీల్దార్లు వై.దుర్గాకిషోర్, జీవీ శేషగిరి, ఏపీ రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

పక్కాగా ఆన్‌లైన్ చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా పరిశీలన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంగళవారం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ వేగిరపర్చాలన్నారు.

27న శతాధిక కవి సమ్మేళనం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27న ఏలూరు వైఎంహెచ్ఏ హాలులో హేలాపురి కవితా సంబరాలు నిర్వహించనుండటం అభినందనీయమని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. శ్రీశ్రీ కళావేదిక ఏలూరు 123వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం బ్రోచర్‌ను సోమవారం ఏలూరులో ఆమె ఆవిష్కరించారు. కవితా సంబరాల నేపథ్యంలో శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా శాఖ అధ్యక్షుడు శ్రీహరికోటి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక సాహిత్య సేవలు అద్వితీయమని కొనియాడారు. శ్రీహరికోటి మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాలనే కాంక్షతో జాతీయ శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. 27న కవి సమ్మేళనాన్ని అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే 200 మంది కవులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. హరికోటి శ్యామల, జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సేవాదళ్ ద్వారా విస్తృత సేవలు

పార్టీ శ్రేణులకు ఎంపీ మిథున్‌రెడ్డి పిలుపు



వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కారుమూరి, ఎంపీ బోస్, చీఫ్ విప్ ముదునూరి, ఎమ్మెల్యే గ్రంధి

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ శ్రేణులు సేవాదళ్ ద్వారా ప్రజలకు సేవలు అందించాలని, సంక్షేమాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లాలని రాజంపేట ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సూచించారు. తణుకు సీఎం ఫంక్షన్ హాల్లో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లాస్థాయి సమావేశానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు, లోకేశ్, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు దిగుతుండటం బాధాకరమని అన్నారు. 151 అసెంబ్లీ సీట్లతో అత్యంత ప్రజాదరణ కలిగిన సీఎంను వ్యక్తిగతంగా దూషించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల నిర్వాకాన్ని ప్రజలు చూశారని, ఇప్పుడు వలంటీర్ల ద్వారా అందుతున్న సంక్షేమ ఫలాలను కూడా ప్రజలు చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 600 హామీలిచ్చి మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన చరిత్ర టీడీపీదని, ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తూ సీఎం జగన్ చరిత్రలో నిలుస్తారని చెప్పారు.

సేవే లక్ష్యంగా ముందుకు.. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ సభ్యులంతా సీఎం జగన్ అందిస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రీజనల్ కో-ఆర్డినేటర్ చినిమిల్లి వెంకటరాయుడు సేవాదళ్‌కు అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. సీఎం జగన్ చదువుల విప్లవాన్ని తీసుకువచ్చి పేదవర్గాలకు ఉచితంగా విద్యనందిస్తున్నారన్నారు.

సేవాదళ్ అంటే గర్వంగా ఉంది.. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ చేస్తున్న సేవలను చూసి గర్వంగా ఉందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. సీఎం జగన్ కులమత వర్గ భేదాల్లేకుండా పాలన అందిస్తుంటే దళితులు, రైతులను వైఎస్సార్‌సీపీకి దూరం చేయాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని విమర్శించారు.

సేవాస్ఫూర్తితో.. సేవాస్ఫూర్తి, సేవాభావంతో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ విభాగం పనిచేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సేవాదళ్ విభాగం క్రమశిక్షణతో పేదవర్గాలకు సేవలందించాలని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఏకైక సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కీర్తి పొందారని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు.

'ఏది నిజం' ద్వారా ప్రజల్లోకి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టే క్రమంలో సేవాదళ్ విభాగం 'ఏది నిజం' కార్యక్రమం ద్వారా డాక్యుమెంటరీని తయారుచేసి ప్రజల్లోకి వెళ్తున్నట్లు సేవాదళ్ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ చినిమిల్లి వెంకటరాయుడు అన్నారు. ముందుగా వేదికపై ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ మిథున్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సేవాదళ్ సభ్యులకు ప్రశంసాపత్రాలను ఎంపీలు మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మంత్రి కారుమూరి, చీఫ్‌విప్ ముదునూరి చేతులమీదుగా అందజేశారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు గుడాల గోపి, పీవీఎల్ నరసింహరాజు, జిల్లా మహిళాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, మేకా శేషుబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఏసుబాబు, తణుకు నియోజకవర్గ పరిశీలకులు మంతెన యోగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'వాహనమిత్ర'తో నిండైన భరోసా

- వరుసగా ఐదో ఏడాది అమలు
- జిల్లాలో 9,282 మంది లబ్ధిదారులు
- 31న ఖాతాల్లో జమ
- ఇప్పటికే నాలుగు విడతల్లో రూ.28.90 కోట్లు అందజేత



వాహనమిత్ర లబ్ధిదారులు

భీమవరం (ప్రకాశం చౌక్): ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు రవాణా శాఖకు సంబంధించిన ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఏటా రూ.10 వేల చొప్పున అందిస్తోంది. ఇది వారికి ఎంతో ఊరటనిస్తోంది. వాహనానికి బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, చిన్నపాటి మరమ్మతులకు ఈ మొత్తం ఉపయోగపడుతోంది. ఆటో, ట్యాక్సీవాలాల ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద చేయూత అందిస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతల సాయం అందించగా ఈనెల 31న ఐదో విడత సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

ఇప్పటికే నాలుగు విడతలు

జిల్లాలో నాలుగు విడతల్లో 28,903 మంది లబ్ధిదారులకు రూ.28 కోట్ల 90 లక్షల 30 వేలు అందజేశారు. ఒక్కో లబ్ధిదారుడు రూ.40 వేల లబ్ధి పొందాడు. ఈ ఏడాది ఐదో విడత సాయానికి సంబంధించి ఇప్పటికే రవాణా శాఖ అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి అర్హుల జాబితాను ప్రభుత్వానికి సమర్పించారు. ఈసారి జిల్లాలో 9,282 మంది లబ్ధిదారులు ఉండగా వారి ఖాతాల్లో రూ.9 కోట్ల 28 లక్షల 20 వేలను జమచేయనున్నారు. గతేడాది లబ్ధిదారులు 7,882 మంది ఉండగా ఈ ఏడాది 1,400 మందికి అదనంగా ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.లలో)
2019-2020	5,527	5,52,70,000
2020-2021	8,030	8,03,00,000
2021-2022	7,464	7,46,40,000
2022-2023	7,882	7,88,20,000
2023-2024	9,282	9,28,20,000

రేషన్ వాహనాలకూ..

ఈ ఏడాది రేషన్ డోర్ డెలివరీ చేస్తున్న రేషన్ వాహనాల (ఎండీయూ) ఆపరేటర్లకు కూడా వాహనమిత్ర సాయం అందించనున్నారు. ఈ మేరకు 365 లబ్ధిదారులుగా గుర్తించారు. వీరికి రూ.36.50 లక్షలు అందించనున్నారు.

చాలా సంతోషం



నేను ఇప్పటికే నాలుగు విడతల్లో రూ.40 వేల సాయం పొందాను. ఈ ఏడాది మరో రూ.10 వేలు అందుకోనున్నాను. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా వాహనమిత్ర సాయం అందించడం సంతోషంగా ఉంది.

– ఆర్.వీర్రాజు, లబ్ధిదారుడు, తాడేరు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ఏటా వాహనమిత్ర పథకం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాయం అందించడం ఆనందంగా ఉంది. రూ.10 వేల సాయం నాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ మొత్తాన్ని వాహనం బ్రేక్, బీమా, నిర్వహణ ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాను.

– సీహెచ్ అప్పారావు, లబ్ధిదారుడు, భీమవరం

31న ఖాతాల్లో జమ




ఈనెల 31న వాహనమిత్ర సాయం ఖాతాల్లో జమకానుంది. ఐదో విడతలో 9,282 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ ఏడాది కొత్తగా 365 మంది ఎండీయూ ఆపరేటర్లకు కూడా రూ.10 వేల సాయం అందించనున్నారు.

– టి.ఉమామహేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి, భీమవరం

వేగంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ

జేసీ రామసుందర్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని 1,454 పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ వేగంగా జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై భీమవరం, ఉండి, ఆచంట నియోజకవర్గాల ఏఈఆర్‌ఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 2022 జూలై 1 నుంచి 2023 మార్చి 31 వరకు, 2023 ఏప్రిల్ 1 నుంచి 2023 ఆగస్టు 21 వరకు రెండు విడతల్లో ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్నారు. ఈ జాబితాల నుంచి పోలింగ్ స్టేషన్లకు వెయ్యి మంది ఓటర్లను ర్యాండమ్‌గా చెక్ చేయాలని ఆదేశించారు. చనిపోయిన వారి ఓటు తొలగింపునకు మరణ ధ్రువీకరణ పత్రం సరిపోతుందన్నారు. ఓటర్ల జాబితా పరిశీలనలో మార్పులు, చేర్పులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. వివాదాలకు, అనుమానాలకు తావులేని విధంగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రవికుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు, జిల్లా సర్వే అధికారి జాషువా, ఎన్నికల సూపరింటెండెంట్ ఎల్.నరసింహారావు పాల్గొన్నారు.

స్పందనలో 162 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరేట్ పరిపాలన అధికారి

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందన కార్యక్రమంలో ప్రజల అందించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి అప్పారావు అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు 162 అర్జీలు అందజేశారు. డీఎస్పీ డి.శ్రీనాథ్, డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్‌తో కలిసి అప్పారావు అర్జీలు స్వీకరించారు.

అర్జీల్లో కొన్ని..

- భీమవరం 9వ వార్డులోని ముత్రాసుల దిబ్బ శివారు అడ్డ సందు ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని పి.దుర్గారావు అర్జీ అందజేశారు.
- యలమంచిలి మండలం అడవిపాలెంలో డ్రెయినేజీ పూడుకుపోవడంతో సుమారు 50 ఎకరాల పంట ముంపు బారిన పడుతుందని ఉల్లంపర్తి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.
- వృద్ధాప్యంలో ఉన్న తనను నలుగురు సంతానంలో ఎవరూ చూడటం లేదని, న్యాయం చేయాలని వీరవాసరం మండలం నందమూరిగరువుకు చెందిన ముద్ద మహాలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

కొల్లేరు అభివృద్ధి ప్రదాత

- ఆక్వా రంగ అభివృద్ధికి ఆద్యుడు సైదు గంగరాజు
- నేడు గంగరాజు శతజయంతి ముగింపు ఉత్సవాలు

కైకలూరు: కొల్లేరు అనగానే తక్కున గుర్తుకు వచ్చేవి పక్షులు, పర్యావరణం. 1940 దశకంలో మాత్రం కొల్లేరు అంటే జమ్ము, కిక్కిసలతో నిండిన అడవి. ఇక్కడ ప్రజలు దియ్యేట అనే పేరుతో పిట్టల్ని వేటాడటం, కొల్లేరులో మావులు ఒగ్గుకుని చేపలు పట్టడం, అల్లిబిగాయలు, నూకల జావతో కడుపునింపుకునేవారు. వ్యవసాయం అంటే తేలీదు. కిలో మీటర్లు బురదలో నడిస్తేనే రోడ్లను చూసేవారు. పాము, పురుగులు కరిస్తే మరణమే శరణ్యం. నిండు గర్భిణి ప్రసవ వేదనలు అప్పట్లో నిత్యకృత్యం. ఇలాంటి దుర్భర పరిస్థితుల మధ్య ఇక్కడి ప్రజలకు వెలుగు చుక్కగా నిలిచాడు సైదు గంగరాజు. నేటితో ఆయన శతజయంతి ఉత్సవాలు ముగిస్తున్న సందర్భంగా ప్రత్యేక కథనం..


సైదు గంగరాజు

కైకలూరు మండలం శృంగవరప్పాడు గ్రామంలో సైదు గోపాలస్వామి, మంగమ్మ దంపతులకు 1927లో గంగరాజు జన్మించారు. టైలరింగ్ పనిచేసేవారు. మూర్తిరాజు వంటి వారితో పరిచయాలు ఏర్పడ్డాయి. కమ్యూనిస్టు భావాలను అలవర్చుకున్నారు. తన జాతి ప్రజలు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూడటంతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించారు. ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్ళారు. కొల్లేరు బంజారు భూముల్లో సార్వా సాగును ప్రారంభించి 'నల్ల ఆర్లు' అనే రకం ధాన్యం పండించారు. అప్పటి వరకు చేపల వేటకే పరిమితమైన కొల్లేరు ప్రజల్లో వ్యవసాయ పద్ధతులు అలవాటు చేశారు.


కైకలూరు మండలం శృంగవరప్పాడులో గంగరాజు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ (ఫైల్)

ఆక్వారంగానికి ఆద్యుడు

దేశంలోనే కొల్లేరు ప్రాంతం ఆక్వా రంగంలో అగ్రగామిగా నిలుస్తోంది. దీనికి ఆద్యుడు సైదు గంగరాజు. 1976 మే 18న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావును తన సొంత గ్రామంలో చేపల చెరువుల ఏర్పాటు కోసం తీసుకొచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కొల్లేరు సమస్యలు వివరించారు. దీంతో కొల్లేరు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ వెంగళరావు నియమించారు. కొల్లేరు సరస్సులో చేపల పట్టడమే కాదు, గట్టులు ఏర్పాటు చేసి చేపల సాగు చేయాలని గ్రామానికి ఎకరం కేటాయించి సొసైటీల ద్వారా రుణాలు ఇప్పించారు. అప్పుడు వేసిన బీజం నేడు దేశ స్థాయిలోనే కొల్లేరు చేపల పరిశ్రమలో మొదటి స్థానంలో నిలవడానికి కారణమైంది. విద్యుత్, రహదారులు, పాఠశాలల ఏర్పాటుకు గంగరాజు కృషి చేశారు.

నీలి విప్లవానికి సాక్షి..

కొల్లేరులో పూర్వం కేవలం గ్రామాల్లో ఎకరా, అర ఎకరా చెరువులు మాత్రమే సాగు చేసేవారు. గంగరాజు కృషితో సొసైటీలు రుణాలు మంజూరు చేశాయి. తర్వాత ఆక్వా చెరువులు సిరులు కురిపించే అక్షయ పాత్రగా మారాయి. జిల్లాలో 9 మండలాల్లో 122 బెడ్, బెల్ట్ గ్రామాల్లో కొల్లేరు పరివాహక ప్రాంతం ఉంది. జనాభా 3.15 లక్షలు. మొత్తం 80 వేల కుటుంబాలకు చెందిన దాదాపు 2 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి రోజు దాదాపు 200 లారీలు ఇతర రాష్ట్రాలకు ఆక్వా ఉత్పత్తులను రవాణా చేస్తున్నాయి. ఏటా రూ.900 కోట్లు టర్నోవర్ జరుగుతోంది. ఆక్వా రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు.

కొల్లేటి కాపురం సినిమాలో...

తుపానుల వల్ల కొల్లేరు ఉగ్రరూపం దాల్చి ఊళ్లకు ఊళ్లను తుడిచిపెట్టేది. ప్రజలు ప్రాణాలు నీటిలో కలిసిపోయేవి. గ్రామాల్లో పెద్దల పెత్తనం ముందు పేదల బతుకులు చితికిపోయేవి. నిరక్షరాస్యత పట్టి పీడించేది. ఈ పరిస్థితులను ఇతివృత్తంగా తీసుకుని దర్శకుడు కెబీ తిలక్ 1976లో కొల్లేటికాపురం సినిమాను తెరకెక్కించారు. హీరో కృష్ణ నటించిన ఈ సినిమాలో సైదు గంగరాజు నటించారు. దర్శకుడు తిలక్‌కు కొల్లేరు పరిస్థితులను గంగరాజు వివరించేవారు. కొల్లేరు గ్రామాల గురించి ఈ సినిమా ద్వారా బాహ్యప్రపంచానికి తెలిసింది.

కొల్లేటి దైవం గంగరాజు



కొల్లేటి గ్రామాల ప్రజలు సైదు గంగరాజును దైవంగా భావిస్తారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. బద్రిరాజు, పిన్నమనేని కోటేశ్వరరావుల వంటి ప్రముఖ రాజకీయ నాయకులతో కలసి అనేక అభివృద్ధి పనులు చేయించారు. ఈ రోజు చేపల చెరువులు ఆదాయ మార్గాలుగా మారాయంటే అనాడు గంగరాజు చేసిన కృషి కారణం.

– జయమంగళ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, కైకలూరు.

గంగరాజు ఓ నిప్పు కణిక



ఆయనతో నేను సాన్నిహిత్యంగా ఉండేవాడిని. ఎంతో దృఢంగా తెల్లటి పంచెతో కొల్లేరు గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తిరిగే వారు. కొల్లేరులో చేపల వేటకు అడ్డుగా ఉన్న లైసెన్సు విధానాన్ని రద్దు చేయించారు. కొల్లేటికోట సర్పంచ్, సొసైటీ అధ్యక్షులు, పెద్దింట్లమ్మ దేవస్థాన చైర్మన్‌గా ఆయన పనిచేశారు. గంగరాజు శతజయంతి ఉత్సవాలను 2022 ఆగస్టు 8న ప్రారంభించాం. మంగళవారం ముగింపు ఉత్సవాన్ని చేస్తున్నాం.

– చింతపల్లి వెంకటనారాయణ, ప్రముఖ సాహితీవేత్త, కైకలూరు.

క్లుప్తంగా

యోగా పోటీల్లో గోల్డ్‌మెడల్


యోగా పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన దండగర్ర స్కూల్ పీడీ బి.చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూలు ఫిజికల్ డైరెక్టర్ బి.చంద్రశేఖర్‌కు గోల్డ్ మెడల్ లభించింది. యోగాసన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనుబంధ జిల్లా స్థాయి యోగాసన చాంపియన్ షిప్ పోటీలు భీమవరం త్యాగరాజు భవనంలో జరిగాయి. ఈ పోటీల్లో మాస్టర్స్ యోగాసన విభాగం నుంచి చంద్రశేఖర్ గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు.

చిట్టీల పేరుతో మోసం

ఏలూరు టౌన్ : ఏలూరు వైఎస్సార్ కాలనీకి చెందిన ఒక మహిళ చిట్టీల పేరుతో పలువురు వ్యక్తుల నుంచి డబ్బులు కట్టించుకుని మోసం చేసింది. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు రూరల్ వైఎస్సార్ కాలనీకి చెందిన దుగ్గిరాల దుర్గాదేవి అదే ప్రాంతంలో పలువురి నుంచి చిట్టీల పేరుతో సొమ్ములు వసూలు చేసింది. తిరిగి సొమ్ములు చెల్లించకుండా మోసం చేయటంతో బాధితులు శ్రీనివాసరావు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.4లక్షల వరకూ నగదు కట్టించుకుని మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణబాబు కేసు నమోదు చేశారు.

వీరేశ్వరుడిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి


పట్టిసం వద్ద హైకోర్టు జడ్జి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులకు వీరేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో సంగమేశ్వర శర్మ

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్య పట్టిసం శివక్షేత్రాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు సోమవారం సందర్శించారు. శివక్షేత్రం వద్ద దేవస్థానం ఈవో ఎస్ఎస్ సంగమేశ్వర శర్మ జస్టిస్ సోమయాజులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రంలోని భావన నారాయణ స్వామిని కూడా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు క్షేత్రం విశిష్టతను తెలియజేయగా, ఈవో సంగమేశ్వర శర్మ స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ బి.సుమతి, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్‌లు ఉన్నారు.

హత్య కేసులో రిమాండ్

ఆకివీడు: భార్యను కిరాతకంగా చంపిన భర్త రాంబాబును భీమవరం జైలుకి తరలించినట్లు ఆకివీడు ఎస్సై సత్యసాయి చెప్పారు. భీమవరం కోర్టులో సోమవారం ముద్దాయిని హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు. అనంతరం జైలుకు తరలించారన్నారు. హత్య జరిగిన స్థలాన్ని ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ సోమవారం మరోసారి పరిశీలించారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు 3వ విడత కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల భర్తీ నిమిత్తం మూడో విడత కౌన్సెలింగ్ ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నిర్వహించనున్నట్లు ఏలూరు ఐటీఐ ప్రధానాధికారి పీ.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నేరుగా ఐటీఐ వెబ్‌సైట్‌లో స్టూడెంట్ ఏరియాలోకి వెళ్ళి దరఖాస్తును ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు కాపీ ప్రింట్ విద్యార్థి తన ఒరిజినల్ సర్టిఫికెట్లతో తాము ఎంచుకున్న సంబంధిత ఐటీఐల్లో ఈ నెల 28 సాయంత్రం 5 గంటల లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ పూర్తయిన వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరు కావడానికి అర్హులన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఆ పైన చదువుకుని ఉపాధి కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు కూడా ఈ ప్రవేశాలకు అర్హులని, 8వ తరగతి ఉత్తీర్ణులై 10వ తరగతి అనుత్తీర్ణులైన విద్యార్థులు వెల్డర్ ట్రేడ్‌కి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో దరఖాస్తులు సమర్పించిన విద్యార్థుల ప్రవేశాలకు ఈ నెల 30, ప్రైవేట్ ఐటీఐలలో దరఖాస్తులు సమర్పించిన వారికి ఈ నెల 31న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 08812–230269 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

శరవేగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం


గుమ్ములూరు సెంటర్ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును పరిశీలిస్తున్న కన్‌స్ట్రక్షన్ ఈఈ టీ వెంకటేశ్వరరావు

ఆకివీడు: విద్యుత్ సమస్యల పరిష్కారానికి, కొత్త కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శరవేగంగా 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని నిర్మాణ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీ వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక గుమ్ములూరు రోడ్డులో సబ్ స్టేషన్ నిర్మాణంలో భాగంగా సోమవారం 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.40 కోట్ల వ్యయంతో ఉమ్మడి జిల్లాలో 11 సబ్ స్టేషన్లు కొత్తగా ఏర్పడిన జగనన్న కాలనీల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒకొక్క సబ్‌స్టేషన్ సుమారు రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే పోణంగి, కొమడవోలు, పోరుమళ్ల, రుస్తుంబాద, కుప్పనపూడి, గుండుగొలను ప్రాంతాల్లో నిర్మాణం పూర్తయ్యిందని వెంకటేశ్వరరావు చెప్పారు. ఆయా కాలనీలకు విద్యుత్ సరఫరా ఇస్తున్నామన్నారు. నిర్మాణంలో ఆకివీడులోని గుమ్ములూరు రోడ్డు, విస్సాకోడేరు, గుడివాకలంక, పైడిపర్రు గ్రామాల్లో సబ్ స్టేషన్లు నిర్మాణ దశలో ఉండగా, దూసనపూడిలో స్థల సేకరణ అనంతరం పూడిక పనుల దశలో ఉందని చెప్పారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, లైన్ల ఏర్పాటు, లబ్ధిదారులకు మీటర్లు, తదితర వాటిని సమకూర్చుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ విభాగపు డీఈ ఎస్.చంద్రశేఖర్ కుమార్, ఏఈ బీ.దివాకర్, స్థానిక రూరల్ ఏఈ ప్రసాదరాజు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బంగారు ఆభరణాల చోరీ


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ, ఎస్సై సత్యసాయి

ఆకివీడు: ఆనాల చెరువు గట్టు సమీపంలోని ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పురోహితుడిగా పనిచేసిన కాకర్ల శ్రీరాములు గత ఏడాది మృతి చెందారు. ఆయన భార్య సీతమ్మ కుమార్తె వద్ద ఉంటూ, ఆరు నెలల క్రితం సొంత ఇంటికి వచ్చారు. తండ్రి సంవత్సరీకం కావడంతో కుమార్తె భమిడిపాటి వసంత దంపతులు ఢిల్లీ నుంచి తల్లి ఇంటికి వచ్చారు. శనివారం పిండ ప్రదానం చేసేందుకు అందరూ కలిసి రాజమండ్రి ఆటోలో వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి ఇంటి తలుపు బద్దలుకొట్టి.. బీరువాలోని బంగారు ఆభరణాలు చోరీకి గురైన విషయం గుర్తించారు. సుమారు 8 కాసుల బంగారు ఆభరణాలు పోయాయని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సత్యసాయి చెప్పారు. సంఘటనా స్థలాన్ని ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్పందన ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలి


భీమవరం డీఎస్పీ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్పందనలో ఫిర్యాదులపై తక్షణం విచారణ జరిపి సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ యు.రవి ప్రకాష్ అన్నారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి 21 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించినవే. అనంతరం ఎస్పీ రవిప్రకాష్ ఫిర్యాదులకు సంబంధించిన పోలీసు స్టేషన్ ఎస్సైలతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

షాపులో బైక్‌ల చోరీ


మోటారు సైకిళ్ల చోరీపై విచారణ చేస్తున్న సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

ఏలూరు టౌన్/ఉంగుటూరు: నారాయణపురం జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న వాసవి కన్సల్టెన్సీ మోటారు సైకిళ్ల విక్రయించే షాపులో చోరీ జరిగింది. ఆదివారం షాపు స్లాబ్‌ను పగులగొట్టి మోటారు సైకిళ్ళు చోరీ చేయడంతో సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. సీఐ మురళీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని, నేర ప్రదేశాన్ని తనిఖీ చేశారు. బండారు ఆంజనేయులు ఈ షాపును నిర్వహిస్తున్నారు. దొంగలు చాకచక్యంగా షాపులోని సీసీటీవీ ఫుటేజ్‌కు సంబంధించి డీవీఆర్‌ను అపహరించారు. షాపులోని మూడు బైక్‌లు అపహరించారు.

సంచార జాతుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


తణుకులో సంచారజాతుల స్వాతంత్ర్య దినోత్సవ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి కారుమూరి తదితరులు

తణుకు అర్బన్: ఈ నెల 31న రాజమండ్రిలో నిర్వహించనున్న సంచార జాతుల స్వాతంత్ర్య దినోత్సవ మహాసభ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆవిష్కరించారు. తణుకు సీఎం ఫంక్షన్ హాలులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కార్యక్రమంలో భాగంగా ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న ఆధ్వర్యంలో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, మేకా శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వేస్టేషన్ పరిధి కొయ్యూరు రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతిచెందాడని ఏలూరు రైల్వే ఎస్సై డీ నరసింహారావు తెలిపారు. సుమారు 40–45 ఏళ్ళ వయస్సు కలిగిన వ్యక్తి ఈ ప్రమాదంలో మృతిచెందినట్లు చెప్పారు. మృతుడు గులాబీ రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో ఉంచామన్నారు. వివరాలకు 95020 97672 నెంబరులో సంప్రదించాలని కోరారు.

మరో ప్రమాదంలో..

పవర్‌పేట రైల్వేగేటు సమీపంలో ఒక వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వే ఎస్సై వివరాల ప్రకారం.. ఏలూరు వెంకటాపురం గాయత్రినగర్‌కు చెందిన కస్తూరి వెంకటకృష్ణ తాపీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. తాపీ పనులకు వెళ్ళేందుకు ఆదివారం ఇంట్లోనుంచి బయలుదేరాడు. రాత్రి 9 గంటల సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనటంతో వెంకటకృష్ణ మృతిచెందాడు.

వికాస్ విద్యాసంస్థల అధినేతపై కేసు

జంగారెడ్డిగూడెం: విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా వారిని వేధించడంతో పాటు, తల్లితండ్రులను నిర్బంధానికి గురిచేసిన వికాస్ విద్యాసంస్థల అధినేత ఊరకర్లం జగన్నాథం(జగన్)పై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులు వేరే చోట చదువుకునేందుకు వికాస్ విద్యాసంస్థలో టీసీ కోసం ఈ నెల 19న తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు వెళ్లారన్నారు. వారికి టీసీలు ఇవ్వకపోగా, టీసీలు ఇవ్వాలంటే చదవని అదనపు 2 తరగతుల ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారన్నారు. ఈ విషయంలో కొప్పుల గంగాధర్‌రావు, మరో 14మంది విద్యార్థుల తల్లిదండ్రులు గట్టిగా నిలదీయడంతో వారిపై బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. దీంతో సదరు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల టీసీలు ఇప్పించడంతో పాటు, మానసిక వేదనకు గురిచేస్తున్న జగన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: కాటా రాళ్ల చోరీపై మద్దుకూరి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మద్దుకూరి ప్రసాద్ చల్లవారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో గృహనిర్మాణ ప్లాంటేషన్‌లో సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడన్నారు. ప్లాంటేషన్‌లో ఉన్న కాటా రాళ్లు షెడ్‌లో ఉంచి తాళం వేశారని.. అయితే ఆదివారం రాత్రి షెడ్ తాళాలు పగులగొట్టి అందులోని కాటారాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు. సోమవారం చోరీ విషయం గుర్తించిన ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కయాకింగ్ పోటీలకు ఎంపిక

సాక్షి, భీమవరం: జాతీయ సీనియర్ కయాకింగ్ పోటీలకు భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి బి.అంజనీకుమార్ నాయక్ ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం కళాశాలలో నాయక్‌ను అభినందించిన సందర్భంగా విలేకర్లకు వివరాలను వెల్లడించారు. ఈనెల 20న విజయవాడలోని పున్నమిఘాట్‌లో నిర్వహించిన కయాకింగ్ పోటీల 500 మీటర్ల పందెంలో నాయక్ బ్రాంజ్‌మెడల్ సాధించినట్లు చెప్పారు. ఉత్తరాకాండ్‌లోని తెహ్రిడామ్‌లో సెప్టెంబర్ 14 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే జాతీయ పోటీల్లో నాయక్ పాల్గొంటాడన్నారు. విజేత నాయక్, శిక్షణ ఇచ్చిన తిరుపతిరావును ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.

భూమి అప్పగించాలంటూ ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సింగనపూడి దళితులు

ఏలూరు (టూటౌన్): తమ భూమిని తమకు అప్పగించాలని కోరుతూ మండవల్లి మండలం సింగనపూడి దళితులు సీపీఎం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. సింగనపూడికి చెందిన 20 దళిత కుటుంబాలకు 15.59 ఎకరాలను ప్రభుత్వం ఇవ్వగా 1925 నుంచి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో సాగు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. 1992లో చేపల సాగుకు ప్రభుత్వం అనుమతివ్వగా పెట్టుబడి పెట్టలేక కైకలూరుకు చెందిన మాడపాటి కృష్ణప్రసాద్‌కు లీజుకు ఇచ్చారని పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత నుంచి లీజు ఇవ్వకపోవడం, ఆ భూమిలోకి దళితులను రానివ్వకపోవడంతో 2016 నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని వివరించారు. దీనిపై జేసీ కోర్టులో కేసు నడుస్తుండగా తుది తీర్పు ఇచ్చేవరకూ భూమిలోకి ఇరుపక్షాలు వెళ్లకుండా ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. కృష్ణప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకేసు నమోదు చేసి దళితులకు రక్షణ కల్పించాలని కోరారు.

సొంతింటి కల.. నెరవేరిన వేళ

- జగనన్న కాలనీలలో చురుగ్గా గృహప్రవేశాలు
- అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం
- లబ్ధిదారుల హర్షం


ముదునూరు గ్రామంలో 98 శాతం నిర్మాణం పూర్తి చేసుకున్న జగనన్న కాలనీ

పెంటపాడు: పేదల ఆనందం ఇంతింత కాదయా.... అంటూ... పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలందరికీ ప్రధాన కోరిక సొంతిల్లు ఉండాలని కలలు కంటారు. దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రతీ కుటుంబానికి లబ్ధిని అందిస్తూ, పేదల కళ్లలో ఆనందం నింపిన ఘనత ఆయనది. సొంతింటి నిర్మాణం అనే ఆ కోరిక చాలా మందికి కలగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వ కాలంలో ఊరుకు పదో, పదిహేనో ఇంటిస్థలాలు ఇచ్చేవారు. ఇంటి నిర్మాణానికి రుణాలు ఇవ్వకుండా చేతులు దులుపుకొని పేదలకు ఇళ్లు ఇచ్చాం అని గొప్పలు చెప్పుకొనేవారు. అది కూడా కులం, మతం, పార్టీ తేడా ఉండేది. అయితే వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కలను సాకారం చేశారు. నవరత్నాలు పథకంలో భాగంగా ఒక హామీ అయిన పేదలందికీ ఇళ్లు ఇస్తానని ఎన్నికల ముందు చెప్పారు. ఆ మేరకు అధికారంలోకి రాగానే కార్యాచరణ చేపట్టారు. ఇంటిస్థలం ఉచితంగా ఇవ్వడంతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షల రుణాన్ని కూడా అందించారు. దీంతో కాలనీలు రూపుదిద్దుకున్నాయి. పర్యావరణ హితంగా కాలనీలు తీర్చిదిద్దాలని దశల వారిగా విద్యుత్, రోడ్లు, చెట్లు ఇలా ఒక్కోసౌకర్యాన్ని అమర్చుతున్నారు. నవరత్నాలు– పేదలందకీ ఇళ్లు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు మండలంలోని 22 గ్రామాల్లో 26 లే అవుట్‌లు ఏర్పాటు చేసి వాటిలో 1400 ప్లాట్లు వేశారు. వాటిని 1370 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటికే 382 ఇళ్ల నిర్మాణాలు పూర్తయాయ్యి. 507 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. బిలో బేస్‌మెంట్ లెవిల్(బీబీఎల్) 481 ఉన్నాయి. ఇక రెండో ఫేజ్‌లో 5 లే అవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో త్వరలో చేపడతారు.

ఇంటి నిర్మాణానికి సాయం

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులకు రూ. 1.80 లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. ఈ నగదును బేస్‌మెంట్, రూఫ్, తదితర లెవల్, శ్లాబ్ నిర్మాణం పూర్తి కాగానే వివిధ దశల్లో నిధులు జమ చేస్తారు. ఈ నగదు నేరుగా లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. అలాగే సొంత స్థలమున్న వారికి ఈ పథకం వర్తిపజేస్తున్నారు. 1.50 సెంట్లు ఉన్న అర్హులు ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహనిర్మాణశాఖ ద్వారా ఈ అవకాశం కల్పించింది. గతంలో బేసిమెంట్ లెవిల్ పూర్తి కాగానే రూ. 53 వేలు అందించేవారు ఆ సొమ్ము రూ.70 వేలకు పెంచారు. రెండో దశలో రూ. 30 వేలను రూ. 50 వేలకు పెంచారు. మూడో దఫా రూ. 24వేలను కాస్తా రూ. 90 వేలకు నాలుగోవిడతలో రూ. 30 వేలు చెల్లిస్తారు. ఈ రకంగా ఇళ్లు నిర్మించుకొనేందుకు జగనన్న ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వడంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రతిపక్షాలు కొన్ని స్థలాల విషయంలో కోర్టుకు ఎక్కడంతో కొన్ని గ్రామాల్లో పేదలకు ఇళ్లస్థలాలు దక్కలేదు. మండలంలోని నాలుగైదు, గ్రామాల్లో ఈ సమస్య ఏర్పడింది.

అద్దె భారం తప్పింది



దీర్ఘకాలంగా అద్దె ఇంటిలో బతికాం. నెలనెలా అద్దె కట్టాలన్న బాధ్యత భారంగా ఉండేది. సొంతిల్లు లేకపోవడంతో అద్దె కట్టుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రతీనెలా రూ. 2,500 నుంచి 4 వేలు వరకు చెల్లించాల్సి వస్తోంది. మండల కేంద్రాల్లో ఈ భారం మరీ ఎక్కువగా ఉండేది. ముఖ్యమంత్రి జగనన్న దయతో నా సొంతింటి కల నేరవేరడంతో చాలా ఆనందంగా ఉంది. – ఆర్. రమణమ్మ, ముదునూరు

జగనన్న మేలు మరువలేం



ఎప్పటికైనా సొంత ఇంటిలో నివసించాలన్నది నా కోరిక. జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకోవడంతో ఆ కోరిక తీరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మేలు ఎప్పటికీ మరచిపోలేము. ఆయన చొరవతో సొంతిల్లు నిర్మించుకొన్నాం. ఇంటి నిర్మాణం కోసం రూ. 1.8 లక్షలు అందించారు. జగనన్నకు కృతజ్ఞతలు

– భావన గంగా భవాని, ముదునూరు, జగనన్న కాలనీ

మాట నిలుపుకున్నారు



ఎంతో కాలం నుంచి సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాము. భర్త లేకపోవడంతో ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించుకొంటూ జీవనం సాగిస్తున్నాను. జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. జగనన్న చల్లగా ఉండాలి. సీఎం జగనన్న దయ వల్ల నా కోరిక తీరింది.

– మత్సా శారా, ముదునూరు, పెంటపాడు మండలం

క్లుప్తంగా

పెంటపాడులో ఫ్యామిలీ వైద్యసేవలు


పెంటపాడు పూరిగుడి వద్ద వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ తోట రాజేష్

పెంటపాడు: ప్రజలు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి తోట రాజేష్ పేర్కొన్నారు. పెంటపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 104 ప్యామిలీ హెల్త్ పరీక్షల్లో భాగంగా ప్రభుత్వ బేసిక్‌స్కూల్ విద్యార్థులకు, పెంటపాడు పూరిగుడి ప్రాంతంలోని రోగులకు ఇంటింటికి తిరిగి వైద్యపరీక్షలు చేశారు. బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుజాత, ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్త మీసాల సాయిబాబా, మారిశెట్టి తేజోనాథ్, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

స్పందనకు ఒకే ఒక అర్జీ

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాల్టీ పరిధి 31వ వార్డులో డ్రెయిన్ నిర్మించాలని కోరుతూ అర్జీ అందినట్లు తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రావిపాడు ధనలక్ష్మి అమ్మవారికి మకరతోరణం


ధనలక్ష్మికి మకరతోరణం ఏర్పాటు చేసిన దృశ్యం

పెంటపాడు: రావిపాడులో ధనలక్ష్మి అమ్మవారికి గ్రామానికి చెందిన దాత తల్లాప్రగడ శ్రీనివాస్ వెండి మకరతోరణం ఏర్పాటు చేసినట్లు గ్రామ ఆలయకమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 55 వేల విలువైన ఈ మకరతోరణం ఏర్పాటు అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు


34వవార్డులో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం అర్బన్: వృద్ధులకు నేత్ర వైద్యం కార్యక్రమంలో భాగంగా స్థానిక 34వవార్డు ఇన్‌చార్జ్ వట్టి బుజ్జి ఆధ్వర్యంలో వృద్ధులకు కంటి చూపు పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు యువనేత కొట్టు విశాల్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యులు వై రాజేంద్రప్రసాద్, ఏఎన్‌ఎం రాజేశ్వరి, సచివాలయ అడ్మిన్ అభి, ఆశావర్కర్ స్వాతి, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

తాడేపల్లిగూడెం: ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం చేపట్టిన హలో మాదిగ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. సోమవారం మహాజన సోషలిస్టు పార్టీ అధికార ప్రతినిధి విస్సంపల్లి సిద్ధుమాదిగ తదితరులు మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు, విప్లవ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సామాజిక న్యాయమని ప్రకటిస్తూ, పార్లమెంటులో చట్టం చేయడంలో విఫలమవుతున్నాయన్నారు. ఏబీసీడీ వర్గీకరణకు మాదిగలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి శ్రీనివాసరావు, లంక రాజశేఖర్, చిన్ని, రవి, వాసు చౌదరి, రాజేంద్ర ఆనంద్, కొల్లి రాజశేఖర్, గాలింకి ప్రేమ్ కుమార్‌లు పాల్గొన్నారు.

సంధ్య కుటుంబానికి రక్షణ కల్పించాలి

ఆకివీడు: అతి కిరాతకంగా సంధ్యను హత్య చేసిన వాడపల్లి రాంబాబు నుంచి మృతురాలి తల్లి దండ్రులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర మానవ హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి, ఏబీబీఎస్ ఉమెన్ సెల్ అధ్యక్షురాలు ఉచ్చుల సుజాత డిమాండ్ చేశారు. మృతురాలి తల్లిదండ్రుల్ని సోమవారం ఆమె పరామర్శించారు. రాంబాబు నుంచి సంధ్య తల్లిదండ్రులకు హానికలిగే ప్రమాదం ఉందన్నారు. దోషికి యావజ్జీవ కారాగార శిక్షవి ధించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ సత్యసాయికి వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు.

రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెంటపాడు: జీవామృతం తయారీ, లింగాకర్షక బుట్టలు, ఎల్లో ప్లేట్‌లు తదితర ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని గూడెం జోనల్ కోఆర్డినేటర్ గద్దే వెంకటరత్నం, పెంటపాడు మండల ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ గుమ్మళ్ల వీర్రాజులు పేర్కొన్నారు. పెంటపాడు యూనిట్ పరిధిలో మీనవిల్లూరు గ్రామంలో రైతులకు సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజామృతం, జీవామృతం తదితర ద్రావణాలు వల్ల చీడపీడలను నివారించుకొనే విధానం రైతులకు తెలిపారు. జీవామృతం, నీమాస్త్రం తయారు చేసే విదానాన్ని రైతులకు తెలిపారు. గత వారంరోజుల నుంచి తయారు చేసుకొన్న కిట్లు రైతులకు పంపిణీ చేశారు. సార్వా పంటకు ప్రధానంగా చీడపీడలు నివారించే శక్తి కేవలం బీజామృతానికే ఉందన్నారు. ప్రధానంగా విత్తనశుద్ధి చేసుకొంటే పంటను అధికశాతం చీడపీడల నుంచి రక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ గ్రామాల వలంటీర్లు, ప్రతినిధులు గ్రామ రైతులు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్లు ప్రజలతో మమేకం కావాలి


తణుకులో జేసీఎస్ కన్వీనర్స్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అప్పగించిన బాధ్యతను జేసీఎస్ కన్వీనర్లు తూచా తప్పకుండా పాటించి ప్రజలకు సత్వర సేవలందించాలని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపల్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన తణుకు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు అందించే సహాయ కార్యక్రమాలకు సంబంధించి జేసీఎస్ కన్వీనర్లు తమ పరిధిలోని గృహసారధులతో సమన్వయంతో పనిచేసే విధంగా కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం వారి వర్గాలకు మాత్రమే మేలు చేసుకునే వారని, కానీ జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కాగితంలో చూస్తేనేకానీ నోటితో చెప్పలేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, జేసీఎస్ కన్వీనర్లంతా గృహసారధులతో కలిసి ప్రతి గడపలోను అందుతున్న లబ్ధిని తెలియచేయాలని స్పష్టం చేశారు.

చంద్రబాబుకు చిన్న మెదడు చితికింది...

చంద్రబాబు వ్యవహారం చూస్తుంటే చిన్న మెదడు చితికినట్లుగా అనిపిస్తుందని రాష్ట్ర మంత్రివర్యులు కారుమూరి ఎద్దేవా చేశారు. ఒక తాయత్తు ఇస్తానని పూజలో పెట్టుకుని తన పేరు చదివి కట్టుకోమని చంద్రబాబు సభల్లో చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. అన్నీ నేనే కనిపెట్టానని, హైదరాబాద్‌ను తానే తయారు చేశాననే అవాస్తవాలు, అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. మేము అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో చెప్పడానికి బదులుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడమే లక్ష్యంగా లోకేష్, పవన్‌కల్యాణ్‌లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జేసీఎస్ కన్వీనర్లకు బీమా సౌకర్యాన్ని కల్పించారని, దానికి సంబంధించిన ధ్రువపత్రాలు అందచేయాలని చెప్పారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలు గుర్తించి ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పే బాధ్యతను జేసీఎస్ కన్వీనర్లు తీసుకోవాలని అన్నారు. ప్రతిపక్షం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టి వాస్తవాలను సాక్ష్యాధారాలతో నిరూపించే విధంగా చూపించా లని సూచించారు. పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బా రావు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు నియోజకవర్గ పరిశీలకులు మంతెన యోగేంద్రబాబు, జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్, అత్తిలి, తణుకు మండల జేసీఎస్ కన్వీనర్లు పెన్మెత్స రామరాజు, కరిబండి రాజేష్, అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల పార్టీ అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, బోడపాటి వీర్రాజు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీలు మక్కా సూర్యనారాయణ, రుద్రా ధనరాజు, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్ పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలని వినతి


అత్తిలిలో ఏపీఎం సునీతకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

అత్తిలి: వైఎస్సార్ క్రాంతి పథకంలో పనిచేస్తున్న యానిమేటర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీఎం కె సునీతకు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా స్వయం సహాయక సంఘాలకు అనునిత్యం సేవలు అందిస్తున్నామని, ప్రస్తుత పరిస్థితులు, పెరిగిన ధరల ఆధారంగా కుటుంబ పోషణ కష్టంగా మారినందున కనీస వేతనం రూ. 25 వేలు పెంచాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తు, అర్హత కలిగిన వారికి పదోన్నతులు, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, వీఓఏలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 3 ఏళ్ల కాలపరిమితి, వయో పరిమితి జీఓ రద్దు చేయాలని, సెర్ప్ నుంచి 5జీ నెట్‌వర్క్ మొబైల్స్ ఇప్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏ సంఘ నాయకురాళ్లు దుక్క ఝాన్సీ, ముత్యాల భాగలక్ష్మి, ఉండూరి సుజాత, గుబ్బల పావని, కాటూరి గౌరీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కొండలరాయుడు ఆలయంలో నాగపంచమి పూజలు


కొండలరాయుడు ఆలయంలో నాగమ్మ అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

అత్తిలి: పట్టణంలో నాగ పంచమి సందర్భంగా అత్తిలి గంటావారిపుంతలో కొలువై ఉన్న శ్రీకొండలరాయుడు ఆలయంలో విశేష పూజలు జరిపారు. ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీనాగమ్మ అమ్మవారికి ఆవుపాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు హోమ పూజల్లో పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు చల్లపల్లి సుబ్బయ్యశాస్త్రి ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో ప్రసాదాలను అందజేశారు. మహిళలకు గాజులు, కుంకుమను పంపిణీ చేశారు. ఆలయ గురువు గొట్టుముక్కల సత్యనారాయణరాజు పర్యవేక్షణలో నాగ పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి.

25లోగా ఓటరుగా నమోదు చేసుకోండి


ఉండిలో విద్యార్థుల నుంచి ఓటు నమోదు పత్రాలు స్వీకరిస్తున్న మల్లికార్జునరావు

ఉండి: ఓటు హక్కు కలిగి ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని జిల్లా పంచాయతీ అధికారి, నియోజకవర్గ ఎన్నికల అధికారి మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ఉండి దివ్యా కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ ఓటు నమోదుకు చివరి తేదీ అని తెలిపారు. ఓటు హక్కు అనేది చాలా గొప్పదని, దానిని అర్హులైన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. మన నిర్ణయాన్ని తెలియజేస్తూ ఓటు వేయడం మన కనీస బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ అప్పారావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తాడేపల్లిగూడెం: విద్యుత్ వినియోగదారులు నెలవారీ చెల్లించే విద్యుత్ బిల్లులను దానిపై ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి చెల్లించవచ్చని ఎలక్ట్రికల్ డీఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పద్ధతిలో ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించే అవకాశం కల్పించామన్నారు. విద్యుత్‌శాఖకు సంబంధించిన ఎలాంటి దరఖాస్తు అయినా గ్రామ, వార్డు సచివాలయాల్లో మాత్రమే రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. విద్యుత్ సర్వీసుకు ఆధార్ నంబరు లింకు కాని వారు ఆధార్ జిరాక్స్‌తో విద్యుత్ సెక్షన్ ఆఫీస్ అధికారులకు అందించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా 1912 కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. పూర్వీకుల పేరుమీద ఉన్న విద్యుత్ కనెక్షన్లను మార్చుకొనేందుకు గ్రామ,వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఈ కోరారు.

ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి

మొగల్తూరు: ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా పూర్తిచేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా గడువు ముగిసిందన్నారు. బీఎల్‌వోలు చేసిన ఓటర్ల నమోదు, ఫారం 6,7,8లపై ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. ఎంత మందిని కొత్త ఓటర్ల జాబితాలో చేర్చారు, ఎంత మంది ఓటర్లను తొలగించారని అడిగి తెలుసుకున్నారు. 80 సంవత్సరాలు పైబడిన ఓటర్ల వివరాలు, 18 సంవత్సరాలు నిండిన ఓటర్ల జాబితాను పరిశీలించారు. మండల స్థాయి అధికారులు, సూపర్ వైజర్లు, బీఎల్‌ఓలు సమన్వయం చేసుకుంటూ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జి.అనితా కుమారి, డీటీ నరేష్, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, ఆర్‌ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పదవీ కాంక్షతో చంద్రబాబు కుయుక్తులు

సాక్షి, భీమవరం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పదవీకాంక్ష పిచ్చి పరాకాష్టకు చేరిందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. సోమవారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడారు. పేదల కష్టాలు పట్టించుకోని చంద్రబాబు అన్నీ నేనే కనిపెట్టానని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బాబు పిచ్చికి సొంత పుత్రుడు లోకేష్, దత్తతపుత్రుడు పవన్‌కల్యాణ్ తోడయ్యారన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు అమరావతి పేరుతో ఆ ప్రాంతంలో పేదవాడు కూడా లేకుండా చేయాలనే దారుణమైన ఆలోచనలో ఉన్నారన్నారు. కరోనా సమయంలో పక్క రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు పదవీకాంక్షతో మరలా రాష్ట్రమంతా తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంగరాజు విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని, ప్రజలంతా జగన్ పక్షానే ఉన్నారని, దీనికి ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శమని మంగరాజు స్పష్టం చేశారు.

ఐటీఐలలో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేయండి

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను మిగిలి ఉన్న సీట్లకు మూడోదఫా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు కోరారు. ఈ నెల 22 నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

ప్రజలంతా శాంతినే కాంక్షించాలి


ఉండిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఉండి: ప్రజలంతా శాంతిమార్గంలో పయనిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుద్దామని, ప్రజలంతా శాంతినే కాంక్షించాలని మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం ఉండి సెంటర్‌లో సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా శాంతియుతంగా జీవించాలని, మనల్ని కాపాడుకుంటూనే తోటివారి శాంతి సంతోషాలకు భంగం కలిగించకూడదని అన్నారు. అలాగే పర్యావరణాన్ని ప్రేమిస్తూ మొక్కలు పెంపకం చేయాలన్నారు. సంస్థ ద్వారా మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

శరవేగంగా రహదారుల నిర్మాణం

- కృష్ణాపురం నుంచి పుల్లాయగూడెం, అప్పారావుపేట రహదారి పూర్తి
- రూ.1.50 కోట్లతో నిర్మాణం
- టెండర్ల దశలో పలు రహదారులు


తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురం - అప్పారావుపేట వరకు నిర్మించిన బీటీ రహదారి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం మండలం, పట్టణంలో రహదారుల నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే హౌసింగ్ బోర్డు నుంచి వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం మెయిన్ గేటు వరకు గ్రామాల పరిధిలో సీసీ రోడ్డు, తదుపరి బీటీ రహదారి నిర్మాణ దశలో ఉంది. ఇప్పటికే హౌసింగ్ బోర్డు నుంచి వెంకట్రామన్నగూడెం చెరువు వరకు రూ.20కోట్లతో పూర్తి చేశారు. తిరిగి వెంకట్రామన్నగూడెం నుంచి ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు మరో రూ.15 కోట్ల పనులు టెండరు దశలో ఉన్నాయి. కృష్ణాపురం నుంచి పుల్లాయగూడెం మీదుగా అప్పారావుపేట గ్రామానికి 4.440 కిలో మీటర్ల రహదారిని ఏఐఐబీ నిధులు రూ.1.50కోట్లతో పూర్తి చేశారు. మెట్ట ఉప్పరగూడెం నుంచి కుంచనపల్లి వరకు గతంలోనే రోడ్డు నిర్మించారు. మెట్ట ఉప్పరగూడెం నుంచి అమృతపురం వరకు రహదారి నిర్మాణం పూర్తయింది.

టెండర్ల దశలో పలు రహదారులు

బాదంపూడినుంచి ప్రత్తిపాడు వరకు రూ.6.90 కోట్లు, కస్బాపెంటపాడు–పడమరవిప్పర్రు రూ.3కోట్లు, దువ్వ – చిలకంపాడు రూ.కోటి, దర్శిపర్రు – కోనాల రూ.కోటి, అలంపురం – అత్తిలి రూ.5కోట్లు, నవాబుపాలెం బ్రిడ్జినుంచి కొత్తూరు మీదుగా ఆరుగొలను, దండగర్ర వరకు రూ.5కోట్లు, మాధవరం–కంసాలిపాలెం బ్రిడ్జి రూ.8కోట్ల పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో ఈ రహదారులను నిర్మించనున్నారు. ఇలా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి.

సెప్టెంబరు నాటికి టెండర్ల ఖరారు

తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి వివిధ గ్రామాలు, నియోజకవర్గాలను కలుపుతూ ప్రతిపాదించిన రహదారులు టెండర్లు దశలో ఉన్నాయి. సెప్టెంబరు నాటికి టెండర్లు ఖరారయ్యే అవకాశం ఉంది. ఆ వెనువెంటనే పనులు చేపట్టడం జరుగుతుంది.

– డీఎం.కోటేశ్వరరావు, డీఈ, ఆర్ అండ్ బీ శాఖ, తాడేపల్లిగూడెం